

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

| RNI APTEL 2013/54510 |


## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 273 పేజీలు - 08 వెల - 05/- మంగళవారం 29-09-2026


# ఏపీకి గుడ్ న్యూస్..

## మచిలీపట్నం-కర్నూలు మధ్య కొత్త ఎక్స్ ప్రెస్ రైలు

**విజయవాడ, గుడివాడ, నంద్యాల మీదుగా కొనసాగనున్న సర్వీసు**

- మచిలీపట్నం-కర్నూలు మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలుకు కేంద్రం ఆమోదం
- వారానికి మూడు రోజులు రెండు దిశల్లోనూ రైలు రాకపోకలు
- కోస్తా, మధ్య ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల మధ్య మెరుగైన అనుసంధానం
- రాత్రిపూట మచిలీపట్నం నుంచి, పగటిపూట కర్నూలు నుంచి ప్రయాణం



ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మచిలీపట్నం, కర్నూలు సిటీ మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించేందుకు ఆమోదం తెలిపింది. ఈ రైలు విజయవాడ, గుడివాడ, నంద్యాల మీదుగా ప్రయాణిస్తూ కీలక ప్రాంతాలను కలుపుతుంది. సుమారు 499 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ సర్వీసు, వారానికి మూడు రోజుల చొప్పున రెండు దిశల్లోనూ అందుబాటులో ఉండనుంది.

వివరాల్లోకి వెళితే..

ఈ రైలు మచిలీపట్నం నుంచి కర్నూలుకు సోమ, బుధ, శనివారాల్లో ఈ రైలు నడవనుంది. మచిలీపట్నంలో సాయంత్రం 4:55 గంటలకు బయలుదేరి, రాత్రంతా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5:45 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, కర్నూలు సిటీ నుంచి మంగళ, గురు,

మిగతా 2లో

## తెలంగాణకు కేంద్రం సహకరించడం లేదు: రేవంత్

- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఇది నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అని వ్యాఖ్య
- ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- రాహుల్ గాంధీని కలిశాకే కాంగ్రెస్‌లో చేరానన్న రేవంత్




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్తర, దక్షిణ భారత్ మధ్య కాకుండా, 'గుజరాత్ వర్సెస్ దేశం' అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అసోంకు చెందిన 'ప్రతిదిన్' దినపత్రిక "భారత్ తదుపరి అధ్యాయం" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అనుమతులు నిలిపివేసిందని మండిపడ్డారు.

మిగతాది 2లో

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..




● యూపీఐ లావాదేవీలపై 0.4% ఛార్జీల విధింపుపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ ● అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం ● రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు ● సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత ● ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు

## తాయ్ మామన్' పథకానికి శ్రీకారం

**'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం**

**మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం**

**కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్**



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన

మిగతాది 2లో

## రాష్ట్రాభివృద్ధికి కూటమి పాలన: నిమ్మల

● మరో 15--20 ఏళ్లు కూటమి పాలన ఉంటే సంపూర్ణ అభివృద్ధి ● వైసిపి పార్టీకి శాశ్వత సమాధి కడితేనే ఇది సాధ్యం ● చీమకుర్తిలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



కూటమి పాలనతోనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం ప్రకాశం జిల్లా చీమకుర్తిలో కారుమంచి మేజర్ కెనాల్ జల హారతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సూపర్ ఎల్‌నినో వంటి విపత్కర పరిస్థితుల్లోనూ చీమకుర్తి వంటి మారుమూల ప్రాంతానికి

మిగతాది 2లో




## ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం మాములుగా ఉండదు.

● ఖైరతాబాద్ ఉపఎన్నికలో నిర్ణయాత్మక ఫలితం వస్తుందని దానం జోస్యం ● ఈసీని వాడుకుని బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శ ● సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ ● ఉపఎన్నికలో పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన దానం

## రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్

● దక్షిణ కాశీ, దక్షిణ అయోధ్య ఉన్న రాష్ట్రంలో ఇలాంటి రాజకీయాలు సరికాదంటూ హితవు

● ప్రధాని మోదీ కాశీ విశ్వనాథుని భక్తుడని, వేములవాడకు వచ్చారని గుర్తుచేశారు



● ఓట్ల కోసం దేవుళ్లను వాడుకుని, ఇప్పుడు విభజిస్తున్నారని తీవ్ర ఆరోపణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేవుళ్లను కూడా విభజించే నీచమైన ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాముడు, శివుడి మధ్య రాజకీయ విభజన రేఖలు గీస్తూ, ఉత్తర, దక్షిణ భారత దేవుళ్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. "కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు దేవుళ్ల మధ్య కూడా విభేదాలు సృష్టిస్తూ కొత్త హాలాహలాన్ని తయారు చేస్తోంది" అని బండి సంజయ్ విమర్శించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ, దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం ఉన్న తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు.

మిగతాది 2లో

## అక్టోబర్ 11 నుంచి విజయవాడ ఉత్సవ్

**-దసరా వేళ**

**-దసరా వేళ నగరాన్ని దేశంలోనే ప్రముఖ ఉత్సవ వేదికగా తీర్చిదిద్దుతాం**

- అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్-2.0 ప్రారంభం
- కళలు, పర్యాటకంతో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్




విజయవాడ ఉత్సవ్ లాంటి ఉత్సవాల వల్ల నగరానికి సరికొత్త ఉత్సాహాన్ని తీసుకురావడంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతాయని, ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారులు తదితర అనేక వర్గాలకు ఉపాధి కల్పిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని రాష్ట్ర పర్యాటక,

## తెలంగాణ స్థానికతపై కీలక తీర్పు

● నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన ● స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం ● రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

మిగతాది 2లో



# తెలంగాణకు కేంద్రం సహకరించడం లేదు: రేవంత్

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ



అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అనుమతులు నిలిపివేసిందని మండిపడ్డారు. దేశం నిధులను గుజరాత్‌కు మాత్రమే తరలిస్తున్నారని, అందుకే ఇది గుజరాత్ వర్సెస్ దేశం అనే పోరాటంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్రకు పాల్పడుతోందని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా పేదలు, ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తున్నారని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, భవిష్యత్తులో మరిన్ని ఓట్లు తొలగించే ప్రణాళికతో ఉన్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని దుయ్యబట్టారు.

**రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులపై గెలిచా**

తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై రెండుసార్లు గెలిచానని, అయితే నాటి ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీలో చేరానని తెలిపారు. 2014 తర్వాత తెలంగాణలో పోరాటం ప్రధానంగా కేసీఆర్‌కు, తనకు మధ్యనే జరిగిందని, తాను అసెంబ్లీలో కంటే జైలులోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2017లో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరానని, ఆయనే తన నాయకుడని నిర్ణయించుకున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత ఎజెండా లేదని, ఆయన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారని కొనియాడారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే ఏకపక్ష ఆధిపత్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్రాభివృద్ధికి కూటమి పాలన: నిమ్మల

సూపర్ ఎల్‌నినో వంటి విపత్కర పరిస్థితుల్లోనూ చీమకుర్తి వంటి మారుమూల ప్రాంతానికి తాగునీటిని అందించడం గొప్ప విషయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటి నిర్వహణలో చూపుతున్న సమర్థత, ముందుచూపును జాతీయ మీడియా గుర్తించి ఆయనను 'వాటర్‌మ్యాన్'గా అభివర్ణించడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి ముందుచూపుతో రాష్ట్రంలోని రిజర్వాయర్లలో కనీస నీటి నిల్వలను కాపాడుతూ తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చీమకుర్తి ప్రాంత ఇరిగేషన్ పనులకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు అందించిన విజ్ఞాపనలను స్వీకరించిన మంత్రి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం మరో 15--20 ఏళ్లు కొనసాగాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. అధికారాన్ని తరచూ మార్చుకుంటూ పోతే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.

2019లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే పోలవరం సహా అనేక సాగునీటి ప్రాజెక్టులు 2021 నాటికే పూర్తయ్యేవని మంత్రి నిమ్మల అన్నారు. అయితే 'ఒక్క ఛాన్స్' అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం వల్ల రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ఇరిగేషన్ శాఖకు సుమారు రూ.18 వేల కోట్ల అప్పు వారసత్వంగా ఇచ్చారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పరిస్థితులతో పాటు ఇరిగేషన్ రంగాన్ని కూడా గాడిలో పెట్టారని మంత్రి తెలిపారు.

ఏ రెండేళ్లలో సాగునీటి రంగంలో కీలక పురోగతి రాయలసీమకు జీవనాడిగా ఉన్న హంద్రీ--నీవా ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు చేసి, 728 కిలోమీటర్ల మేర కృష్ణా జలాలను తరలించామని మంత్రి తెలిపారు. రూ.2,200 కోట్లు ఖర్చు చేసి మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కలను సాకారం చేశామని అన్నారు. వెలిగొండ ద్వారా కృష్ణా జలాలు నల్లమలసాగర్‌కు చేరి ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. రూ.1,800 కోట్లు ఖర్చు చేసి పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా సెప్టెంబర్ 2న ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని అన్నారు. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ఎప్పుడు పూర్తిచేస్తామో చెప్పలేమని గత పాలకులు చేతులెత్తేశారని మంత్రి విమర్శించారు. అదే పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలకు ముందే ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని తెలిపారు.

లిఫ్ట్ అండ్ ఎం పనులకు భారీగా నిధులు

సాగునీటి వ్యవస్థల నిర్వహణ, మరమ్మతులకు అత్యవసరంగా చేపట్టాల్సిన ఓ అండ్ ఎం పనులపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఓ అండ్ ఎం పనులకు రూ.1,320 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వహణ పనులను సక్రమంగా చేపట్టి ఉంటే కారుమంచి మేజర్ కెనాల్‌కు ఇంతటి నష్టం జరిగేది కాదన్నారు.

గత పాలనలో జరిగిన మైనింగ్ పేలుళ్ల కారణంగా కారుమంచి మేజర్ కెనాల్ గట్టు తీవ్రంగా దెబ్బతిందని మంత్రి తెలిపారు. దీంతో సుమారు 16 వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని, అలాగే 8 మంచినీటి చెరువులకు నీరు చేరక తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని వివరించారు. అయినప్పటికీ గత పాలకులు ప్రజల కష్టాలను పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి రూ.2.65 కోట్లు వెచ్చించి కారుమంచి మేజర్ కెనాల్‌ను పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని తెలిపారు.

**శేషయ్యకు మంత్రి అభినందనలు**

కారుమంచి మేజర్ కెనాల్ నిర్మాణం, పటిష్టతకు సంబంధించిన సాంకేతిక అవరోధాలను తొలగించడంలో చీమకుర్తికి చెందిన, ప్రస్తుతం దుబాయ్‌లో నివసిస్తున్న శేషయ్య అందించిన సహకారాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. కారుమంచి మేజర్ కెనాల్ కోసం రూ.25 లక్షల విరాళం అందించిన శేషయ్యకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన 'పి-4' కార్యక్రమానికి స్పందించి శేషయ్య ఈ మంచి కార్యక్రమంలో భాగస్వామి కావడం అభినందనీయమన్నారు.

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే లు దామచర్ల జనార్దన్, బి. ఎన్. విజయ్ కుమార్, ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు, దర్శి టీడీపీ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి, ప్రవాసాంధ్రుడు నల్లూరి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 11 నుంచి విజయవాడ ఉత్సవ్

నగరంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో సోమవారం నిర్వహించిన విజయవాడ ఉత్సవాల కర్టెన్ రైజర్ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరై మాట్లాడుతూ... విజయవాడ నగరానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్-2.అని అన్నారు. విజయవాడ ఉత్సవాల నిర్వహణకు చొరవ తీసుకున్న ఎంపీ కేశినేని చిన్ని, 'సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ' నిర్వాహకులు, గత ఏడాది చాలా ఉత్సవాలను నిర్వహించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళలు, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. అంతరించిపోతున్న తోలుబొమ్మలాట, డప్పు, తప్పెటగుళ్ల వంటి జానపద కళారూపాలు, పౌరాణిక పద్య నాటకాలను పరిరక్షించడంతో పాటు కళాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కళలు యువతలో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు.

విద్యా, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ...లి విజయవాడకు ఘనమైన చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాశస్త్యం ఉందన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గమ్మ ఆశీస్సులతో పది రోజుల పాటు ప్రజలంతా సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలనే సదుద్దేశంతో ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక ఆర్థిక వ్యవస్థతో పాటు జిల్లా స్థూల ఉత్పత్తి (+జిఇఖ) కూడా పెరుగుతుందని తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్న మంత్రి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం సామాజిక, కుటుంబ సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతోందన్నారు. ఇదే స్ఫూర్తితో తన నియోజకవర్గమైన ధర్మవరంలోనూ సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా స్వర్ణాంధ్రప్రదేశ్, వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. దేశంలోనే అతిపెద్ద దసరా ఉత్సవంగా తీర్చిదిద్దే లక్ష్యం అని అన్నారు. విజయవాడ దసరా ఉత్సవాలను దేశంలోనే ప్రముఖ ఉత్సవంగా తీర్చిదిద్దడంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేలా ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉత్సవంగా నిర్వహించాలన్నది లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలను విజయవాడ ఉత్సవ్ కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గత ఏడాది ప్రజాప్రతినిధులు, నగర ప్రజల సహకారంతో ప్రారంభించిన 'విజయవాడ ఉత్సవ్-1' విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ల ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. దసరా నవరాత్రుల్లో కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు విజయవాడ ఆతిథ్యాన్ని, నగర సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 11 నుంచి 20 వరకు 'విజయవాడ ఉత్సవ్-2.0'ను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నగరంలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, పున్నమి ఘాట్, సిద్ధార్థ సైన్స్ కళాశాల ప్రాంగణాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, వెనిగండ్ల రాము, శాసనమండలి సభ్యులు వర్ల రామయ్య, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, రాష్ట్ర సృజనాత్మక మరియు సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎమ్, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి గుడ్ న్యూస్.. మచిలీపట్నం-కర్నూలు మధ్య కొత్త ఎక్స్ ప్రెస్ రైలు

రాత్రంతా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5:45 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, కర్నూలు సిటీ నుంచి మంగళ, గురు, ఆదివారాల్లో ఉదయం 9:30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9:35 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. ఈ సమయాలు రాత్రి ప్రయాణికులకు, అలాగే పగటిపూట ప్రయాణించాలనుకునే వారికి అనుకూలంగా ఉన్నాయి. ఈ రైలు సర్వీసుకు గుడివాడ, విజయవాడ, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపురం రోడ్, కంభం, గిద్దలూరు, దిగువమెట్ల, నంద్యాల, బేతంచెర్ల, డోన్ స్టేషన్లలో వాణిజ్యపరమైన హాల్టులను కేటాయించారు. ఈ కొత్త రైలుతో కోస్తా జిల్లాల నుంచి పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు జిల్లాలకు ప్రత్యక్ష రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, వైద్య అవసరాల కోసం ఈ ప్రాంతాల మధ్య తరచూ ప్రయాణించే వేలాది మందికి ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రైలు నంబర్, ఛార్జీల వివరాలను రైల్వే శాఖ త్వరలో అధికారికంగా ప్రకటించనుంది.



# ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం మాములుగా ఉండదు: దానం నాగేందర్

(మొదటి పేజీ తరువాయి)

ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నికపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలో వచ్చే తీర్పు నిర్ణయాత్మకంగా ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దానం నాగేందర్, బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ 'ఓట్ల దొంగతనం' చేస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఇదే జరిగిందని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఖైరతాబాద్ సీటు ఫలితాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దానం డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరపాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ ఉపఎన్నికలో పోటీకి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు.

# తెలంగాణ స్థానికతపై కీలక తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది. ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

"మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్‌లోనే హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మన్యంకొండ ఉంది. శివుడు, విష్ణువుల ఐక్యతకు ప్రతీక అయిన ఆ క్షేత్రం గురించి మీకు తెలియదా?" అని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథుడైన శివుడికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మెట్టమొదటి ప్రధాని కూడా ఆయనేనని బండి సంజయ్ గుర్తుచేశారు. "ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమాణాలు చేసి ఓట్లు అడిగిన మీరు, ఇప్పుడు అదే ప్రజలను విభజించడానికి దేవుళ్లకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. శివుడి హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు ఉంటారనేదే సనాతన ధర్మం" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలను హిందువులు గమనించాలని, బీజేపీ నేతలు 'హర్ హర్ మహాదేవ్' అనరని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ప్రధాని మోదీ స్వయంగా ఆ నినాదం చేస్తారని స్పష్టం చేశారు.

# తాయ్ మామన్' పథకానికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్చరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..

(మొదటి పేజీ తరువాయి)

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

**కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2బీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. **ఎవరికి మినహాయింపు?**

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం. యూపీఐ క్యూఆర్ కోడ్ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది. అత్యవసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

## నంద్యాలలో 'ప్రపంచ రేబీస్ దినోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నశీద్యాల జిల్లా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శారద బాయి , జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ యస్. అష్రుఫ్ ఆలీ , జిల్లా "ప్రపంచ రేబీస్ దినోత్సవం - 2026"




పోస్టర్ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మీ , డి పి యమ్ ఓ అధికారి డాక్టర్ శ్రీనివాసులు మరియు డాక్టర్ శ్రీజ ఇతర వైద్యులు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. "కలిసి ఉంటే మరింత బలం" అనే నినాదంతో రేబీస్ వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రేబీస్ వ్యాధి నివారణ, కుక్కలు మరియు తదితర జంతువుల కాటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటం, కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు మరియు నీటితో శుభ్రంగా కడిగి, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్యసంస్థను సంప్రదించి అవసరమైన యాంటీ రేబీస్ వ్యాక్సిన్ మరియు వైద్య చికిత్స పొందాలని అధికారులు సూచించారు. "రేబీస్‌ను నివారించవచ్చు -- అవగాహనతో ప్రాణాలను కాపాడవచ్చు" అనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం..

పాణ్యం సెప్టెంబరు 28 పల్లె వెలుగు : భగత్‌సింగ్ త్యాగస్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా



తీసుకుని ప్రజా సమస్యలపై చైతన్యంతో స్పందించాలని
సీఐటీయూ మండల కార్యదర్శి కె. భాస్కర్ పిలుపునిచ్చారు.పాణ్యం ఆటో స్టాండ్ ఆవరణలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారని తెలిపారు. సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం ఆయన కన్న కలలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు కేజే శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నాయకులు నాగరాజు, ఆటో వర్కర్లు, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల అర్ధనగ్న ప్రదర్శన

బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 28: గ్రామ రెవెన్యూ నాయకులు అర్ధనగ్న ప్రదర్శనతో సోమవారం బండి ఆత్మకూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద సమ్మెకు పూనుకున్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు చేస్తున్న నిరవధిక సమ్మె కార్యక్రమం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల జాయింట్ యాక్షన్



కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ పెద్దన్న నంద్యాల జిల్లా అధ్యక్షుడు నారాయణ అధ్యక్షుడు శేష మాట్లాడుతూ తమ సమస్యలను గురించి అధికారుల దృష్టికి ఎన్ని మాటలు తీసుకు వెళ్లినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తక్కువ వేతనాలతో తమ కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని, పని మాత్రం పెరుగుతూ ఉందని కానీ జీతం మాత్రం పెరగడం లేదని నిరసన వ్యక్తం చేశారు. తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వ మొండి వైఖరిని అవలంబిస్తే తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు హెచ్చరించారు.

## రాయితీపై రైతులకు విత్తన శనగలు



దొర్నిపాడు సెప్టెంబర్ 28 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడుమండలంలోని రైతులందరూ సంబంధిత రైతు సేవ కేంద్రాల పరిధి లో రాయితీ పై విత్తనశనగలు పంపిణీ కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రమీలతెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్వింటాలుకు రూపాయలు. 5850/- ధర ప్రభుత్వం వారు నిర్ణయించడం జరిగింది. కావలసిన రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతులను కోరారు

# ప్రజా సమస్యల పరిష్కారంలో

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**● అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి ● పీజీఆర్ఎస్‌లో 'రీ-ఓపెన్' కేసులు తగ్గాల్సిందే ● కలెక్టరేట్‌లో ఘనంగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజల నుంచి అందే వినతుల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా సహించేది లేదని, ప్రతి అర్జీకి బాధితులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, నిర్దేశిత గడువులోపు



పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యను పరిష్కరించిన తర్వాత అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టమైన వివరాలతో ఉండాలన్నారు. నిబంధనల ప్రకారం పరిష్కరించలేని సమస్యలు ఉంటే, అందుకు గల కారణాలను అర్జీదారుడికి అర్థమయ్యేలా లిఖితపూర్వకంగా వివరించాలని సూచించారు.
ముఖ్యంగా పీజీఆర్ఎస్‌లో 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సమస్య సమగ్రతను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం రాదని పేర్కొన్నారు. చట్ట పరిధిలో వీలైనంత త్వరగా ప్రజలకు న్యాయం చేసి, ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించాలని దిశానిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివప్రసాద్ రెడ్డి, రామసుబ్బయ్యతో పాటు పలు శాఖల జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణుల ఏకీకృత సంఘం ఏర్పాటు హర్షణీయం: కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ

**● నూతన కార్యవర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు ● ప్రధాన సంఘంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి ● సంఘానికి కార్పొరేషన్ తరపున పూర్తి సహకారం**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో దశాబ్ద కాలంగా సరైన దిశానిర్దేశం లేని వివిధ విశ్వబ్రాహ్మణ సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి, ఏకీకృత సంఘంగా ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఏకీకృత సంఘం ఆవిర్భావం విజయవంతం కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఏకీకృత సంఘం ఏర్పాటుతో పాటు నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలక పాత్ర పోషించి, సభ ఆమోదంతో బాధ్యతలు చేపట్టిన గౌరవ అధ్యక్షులు బ్రహ్మశ్రీ జవ్వాది కూర్మచారి, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ధనాలకోట వాసు, కార్యదర్శి ధనుంజయ చారిలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో అనుభవజ్ఞులైన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి, రాష్ట్ర చరిత్రలోనే సంఘం సుస్థిర స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ మహాకార్యానికి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా తనతో పాటు డైరెక్టర్లందరి పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.



మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి:
సంఘం రూపొందించే నూతన బైలాస్‌లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని కమ్మరి పార్వతమ్మ విజ్ఞప్తి చేశారు. మహిళలను కేవలం అనుబంధ సంఘాలకే పరిమితం చేయకుండా, ప్రధాన కార్యవర్గంలోనే 33 శాతం రిజర్వేషన్ కల్పించి నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని ఆమె సంఘ పెద్దలను కోరారు.

---

## ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా నరసింహమూర్తి ఏకగ్రీవ ఎన్నిక.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా బ్రాహ్మణ సమాజ సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలనే ఉద్దేశంతో నూతన జిల్లా అధ్యక్షుడిగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు.
ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సమాఖ్య సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల జిల్లాలోని బ్రాహ్మణ కుటుంబాల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.
బ్రాహ్మణుల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకుని సమాఖ్యను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.
నరసింహమూర్తి ఏకగ్రీవ ఎన్నికపై సమాఖ్య నాయకులు, సభ్యులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో నంద్యాల జిల్లాలో బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.
ఈ పత్రిక సమావేశంలో పాల్గొన్న వారు రాష్ట్ర కమిటీ సభ్యులు విశ్వనాథ్, నవీన్, జిల్లా కార్యదర్శి పురాణం సాయికిరణ్, ముల్లంగి కుమార్, గాదిరాజు దత్తాత్రేయ శర్మ, రవితేజ శర్మ, నందన శర్మ, శ్రీవత్సవ, తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహంలో వైఎస్సార్సీపీ యువజన విభాగం నేత సద్దలకు కాటసాని ఆశీస్సులు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఇటీవల



సూరజ్ ఎపిటోమ్ అపార్ట్‌మెంట్‌లో నూతన గృహప్రవేశం పూర్తి చేసుకున్న వైఎస్సార్సీపీ యువజన విభాగం నాయకుడు, గగ్గటూరు మాజీ సర్పంచ్, 'హెల్పింగ్ హాండ్స్ సొసైటీ' అధినేత సద్దల చంద్రశేఖర్ రెడ్డి-పద్మావతి దంపతులను వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామ్‌భూపాల్ రెడ్డి ఆత్మీయంగా కలిసి ఆశీర్వదించారు. పార్టీ యువజన విభాగంలో చురుగ్గా వ్యవహరిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన సద్దల చంద్రశేఖర్ రెడ్డి నూతన గృహప్రవేశం చేసిన సందర్భంగా కాటసాని రామ్‌భూపాల్ రెడ్డి స్వయంగా వారి నివాసానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డి-పద్మావతి దంపతులతో పాటు వారి కుమారుడు సద్దల అనీష్ రెడ్డి, కుటుంబ సభ్యులు లోకేష్ రెడ్డి, అఖిల, భాగ్యమ్మలను అభినందిస్తూ, వారి కుటుంబం సకల శుభాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ, ఇతర రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్సీపీ నేత సూర్యనారాయణ రెడ్డి, ఎంఐఎం పార్టీ నాయకుడు నారాయణ రెడ్డి, వైసీపీ నాయకులు సుమంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మదన్మోహన్ రెడ్డి, శివారెడ్డి, మహేష్ రెడ్డి, గురువారెడ్డి తదితరులు హాజరై సద్దల చంద్రశేఖర్ రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్(స్వాభిమాన్ ) ఏర్పాటు చేయాలని డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి డిమాండ్ చేశారు. కాకినాడ, తూర్పుగోదావరి,అనంతపురం, మరియు అనేక జిల్లాలలో త్రివ్యాంగులకు ప్రతి నెల మూడవ శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ ( స్వాభిమాన్ ) కార్యక్రమం ఏర్పాటు చేసి దివ్యాంగుల సమస్యలను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమస్యలను పరిష్కరిస్తున్నారని అదేవిధంగా నంద్యాల జిల్లాలో కూడా దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని అన్నారు . దీనివల్ల నంద్యాల జిల్లా వ్యాప్తంగా దూర ప్రాంతాల నుండి దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకోవడానికి వీలుంటుందని, అలాగే నంద్యాల జిల్లాలో దివ్యాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాలు ఉండాలని, దీనివలన దివ్యాంగులకు సుదూర ప్రాంతాల ప్రయాణం చేయకుండా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. దివ్యాంగులకు సంబంధించి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం అవుతాయని అన్నారు . ప్రస్తుతం ఉమ్మడి జిల్లా ఎడి కార్యాలయము 72 కిలోమీటర్లు దూరంలో ఉందని దివ్యాంగులు అక్కడికి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కి మెమరాండం అందించారు. ఈ కార్యక్రమంలో డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, సభ్యులు హుస్సేన్ వలి, వెంకటసుబ్బయ్య మరియు సాక్ష్యం సేవా కేంద్ర ప్రముక్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై విచారణ జరిపి న్యాయం చేస్తాం: ఎస్పీ విక్రాంత్ పాటిల్

**- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 128 వినతులు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు తక్షణమే న్యాయం అందిస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్పష్టం చేశారు. సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 128 ఫిర్యాదులు అందాయి. బాధితుల సమస్యలపై త్వరితగతిన స్పందించి పరిష్కారం చూపాలంటూ పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

ప్రధాన ఫిర్యాదులు ఇవే: రూ.18 లక్షల మోసం: పోస్టల్ శాఖలో ఉద్యోగాల పేరిట రూ.18 లక్షలు కాజేసిన సంపంగి వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని దిన్నెదేవరపాడు వాసి వెంకట సుబ్బారెడ్డి కోరారు.

రైల్వే నకిలీ ఐడీ కార్డులు: రైల్వే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలంటూ నకిలీ ఐడీ కార్డులిచ్చి రూ.4 లక్షలు మోసగించిన కడప మహిళపై చర్యలు కోరుతూ కల్లూరుకు చెందిన రవితేజ, జయచంద్ర ఫిర్యాదు చేశారు.

భూమి అక్రమ మ్యుటేషన్: మరణించిన తండ్రి పేరిట తప్పుడు రికార్డులతో రూ.12 లక్షల విలువైన 2.30 ఎకరాల భూమిని కాజేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఉయ్యాలవాడ వాసి మల్లికార్జున ఎస్పీకి విన్నవించారు.

అనాథాశ్రమానికి టోకరా: ఫండింగ్ ఇప్పిస్తామని రూ.8 లక్షలు కాజేసిన మంజునాథ్‌పై చర్యలు కోరుతూ ఆస్పరి ఆశ్రమ ప్రతినిధి రమేష్ అర్జీ ఇచ్చారు. ఇతర సమస్యలు: మరుగుదొడ్డి నిర్మించుకోనివ్వకుండా వేధిస్తున్న పక్కింటి వ్యక్తిపై పెద్దకడబూరుకు చెందిన పద్మ, రూ.45 వేల అప్పుకు పూచీగా ఉంచిన 5 తులాల బంగారాన్ని తిరిగివ్వడం లేదని కర్నూలుకు చెందిన అనురాధ ఫిర్యాదు చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, మస్తాన్ వలి, రామకృష్ణ పాల్గొన్నారు.

# రెగ్యులర్ యోగా కోచ్‌ను నియమించండి: జేసీకి ఫిర్యాదు

- శాప్ నిబంధనలకు విరుద్ధంగా రిటైర్డ్ కోచ్ కొనసాగింపుపై ఆగ్రహం
- సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్‌డీవోకు జేసీ ఆదేశం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌డీఏ)లో తక్షణమే రెగ్యులర్ యోగా కోచ్‌ను నియమించాలని జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు అవినాష్ శెట్టి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి ఆయన లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ శెట్టి మీడియాతో మాట్లాడుతూ... శాప్ (శాప్శాప్శా) బోర్డు నిబంధనలకు విరుద్ధంగా రిటైర్డ్ యోగా కోచ్‌ను ఇంకా విధుల్లో ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. గతంలో సత్యనారాయణ యోగా కోచ్‌గా పనిచేసిన కాలంలో ఒక్క క్రీడాకారుడిని కూడా తీర్చిదిద్దలేకపోయారని ఆరోపించారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఆయన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారుల భవిష్యత్తు దృష్ట్యా ఆయన స్థానంలో అర్హుడైన మరొకరిని రెగ్యులర్ కోచ్‌గా నియమించి యోగాభివృద్ధికి కృషి చేయాలని జేసీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనిపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ... జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) భూపతిరావును పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ అంశంపై పూర్తి విచారణ జరిపి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్‌డీవోను జేసీ ఆదేశించారు.

# మహిళల భద్రతకు 'శక్తి' యాప్ ఒక రక్షణ కవచం.




గడివేముల పల్లె వెలుగు దినపత్రిక ఉత్తర్వుల మేరకు గడివేముల నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ డీఎన్ ప్రసాద్ వెంకటేశ్వర్లు ప్రసాదు వారి టీమ్ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ సార్ ఆదేశాల మేరకు ఏ ఎస్ పి సుస్మిత మేడమ్ వారి మండలం కరిమద్దెల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు గల విద్యార్థినులకు శక్తి యాప్ గురించి శక్తి యాప్ నంబర్ 7993485111 ను తెలిపి ఎక్కడైనను నేరములు ఈవ్ టీజింగ్ ర్యాగింగ్ మొదలగునవి జరిగినచో ఎమర్జెన్సీ నంబర్స్ 112 100 లకు ఫోన్ చేయవలెనని తెలిపి నాము తమ తల్లిదండ్రుల మొబైల్ కు ఫేక్ మెసేజ్లు ఏపీకే ఆప్స్ వచ్చిన పెళ్లి పత్రికలు అను యాప్ వచ్చిన ఓపెన్ చేయరాదని ఎవరైనా బ్యాంక్ వాళ్ళము అని చెప్పి ఓటీపీ నెంబర్ అడిగినచో చెప్పరాదని అట్లు చెప్పుటవలన కలిగే ఆర్థిక నష్టాల గురించి వివరించి ఎవరికైనను సైబర్ నేరము జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవలెనని ఎక్కడైనను 18 సంవత్సరముల లోపు అమ్మాయిలకు బాల్యవివాహములు చేయుచున్నచో టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి చెప్పవలెనని వారికి తెలిపి వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను శక్తి టీముల పనితీరును వివరించి, ప్రతి అమ్మాయిలా మహిళల మొబైల్ నందు శక్తి యాప్ తప్పనిసరిగా ఉండవలెనని శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచమని ప్రతి అమ్మాయి ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రుల మొబైల్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేయవలెనని డౌన్లోడ్ చేసుకునే విధానం వివరించి అమ్మాయిలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి రావాలని తల్లిదండ్రుల మరియు గురువుల స్కూలు యొక్క పేరును నిలబెట్టాలని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు.

## పది లక్షలతో సిమెంటు రోడ్లు వేశారు అయితే..






బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 28: బండి ఆత్మకూరులో 10 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి సిమెంటు రోడ్లు అయితే వేశారు. కానీ రోడ్లను పూర్తి చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నాలుగు నెలల క్రితం బండి ఆత్మకూరులో సిమెంట్ రోడ్లు వేశారు. రాయిమాను నుండి మునగాల సుధాకర్ రెడ్డి ఇంటి వరకు సిమెంట్ రోడ్లతో పాటు, ఇతర రోడ్లను కూడా ఈ ప్రాంతంలో నిర్మించారు. సుధాకర్ రెడ్డి ఇంటి వద్ద నుండి కొత్త రోడ్డును కలపడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఉదయం పూట ఈ ప్రాంతమంతా నీళ్లు నిలబడి పోతూ ఉన్నాయి. ఈ కారణంగా పాదచారులకు ఇబ్బందులు ఏర్పడుతూ ఉన్నాయి. ఇదే ప్రాంతంలో పంచాయతీరాజ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నిత్యం తిరుగుతూ ఉన్నప్పటికీ, ఇక్కడ ఉన్న దుస్థితి గురించి గుర్తించడం లేదు.

## దాడి కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్ -- రిమాండ్‌కు తరలింపు.

**-ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి .**



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. గత నెల 8వ తేదీన ఆత్మకూర్ బస్టాండ్ సమీపంలోని త్రివేణి బార్‌లో జరిగిన గొడవకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భముగా ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ ?అరెస్ట్ అయిన వారిని ఇమ్రాన్ మరియు ఈశ్వర్‌లుగా గుర్తించారు. నిందితులు ఇద్దరూ సల్మాన్ రాజు అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టి ఈ రోజు వారిని అరెస్ట్ చేశారు.?

విచారణలో ఇమ్రాన్‌పై నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉన్నట్లు తేలిందని పోలీస్ అధికారి తెలిపారు. పోలీసుల హెచ్చరిక సమాజంలో రౌడీషీటర్లు మరియు ఇతర నేరస్థులు చట్టానికి కట్టుబడి, మర్యాదగా జీవించాలని పోలీసులు స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి





మహానంది, పల్లె వెలుగు గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లు సావిత్రి, లక్ష్మీనారాయణమ్మ, పుష్పాలత పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలంలోని అబ్బీపురం, గాజులపల్లె, తిమ్మాపురం, తదితర గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్వాడి ఉత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..గర్భిణీ మహిళలు ఆకుకూరలు పండ్లు పాలు గుడ్లు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు పుట్టబోయే బిడ్డ బలంగా జన్మిస్తారని అన్నారు. బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల తల్లిపాలు పుష్కలంగా రావడంతోపాటు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని సంపూర్ణంగా అందజేస్తుందన్నారు.

## ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు



బనగానపల్లె, సెప్టెంబర్ 28, పల్లెవెలుగు బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన యోధుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలో భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడైన భగత్ సింగ్ 119 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి భగత్ సింగ్ స్టూడెంట్స్ యూత్ టీం నంద్యాల జిల్లా కార్యదర్శి చందు , బిజెపి నాయకులు శివకృష్ణ యాదవ్, కొలిమిగుండ్ల మండలం జనసేన పార్టీ నాయకుడు పృథ్విరాజ్ లు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజవాదులను గడగడలాడించిన యోధుడు సర్దార్ భగత్ సింగ్ అన్నారు. నేటితరం యువతకి స్ఫూర్తిదాయకమన్నారు. భగత్ సింగ్ అడుగుజాడల్లో యువత నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు హరికృష్ణ గౌడ్ , ఏబీవీపీ జాయింట్ సెక్రెటరీ దివాకర్, సహాయ కార్యదర్శి మధు కృష్ణ, శ్రావణ్, సుదర్శ, వలి, మధు కృష్ణ, సాయి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 19 వసంతాల సినీ ప్రస్థానం సందర్భంగా అంబరాన్నంటిన సంబరాలు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మెగా వారసుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టి తనకంటూ



ఒక స్టైల్, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని నేడు "గ్లోబల్ స్టార్" స్థాయికి ఎదిగిన రామ్ చరణ్ తేజ్ సినీ రంగంలో విజయవంతంగా 19 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ అద్భుతమైన మైలురాయిని పురస్కరించుకుని, నంద్యాల మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నంద్యాలలోని సంగీత్ థియేటర్ వద్ద మెగా అభిమానులు ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. కన్నుల పండువగా సాగిన ఈ సంబరాల్లో అభిమానులు భారీ ఎత్తున బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని, ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ స్టేట్ కో కన్వీనర్ పబ్బతి రవి, ఉమ్మడి కర్నూలు జిల్లా కో కన్వీనర్ బ్లడ్ అచ్చు, నంద్యాల నియోజక వర్గ అధ్యక్షులు సురేష్ చౌదరి, జాయింట్ కన్వీనర్ సాయి జయంత్ , ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంధానీ పాల్గొన్నారు. రామ్ చరణ్, మెగాస్టార్ నినాదాలతో సంగీత్ థియేటర్ ప్రాంగణం దద్దరిల్లింది. ఇలాంటి మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించాలని, బ్లాక్ బస్టర్ హిట్లతో అభిమానులను మరింత అలరించాలని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కి శుభాకాంక్షలు తెలియచేశారు.

## శ్వాస మీద పట్టు సాధిస్తే మనిషికి ఏకాగ్రత పెరుగుతుంది

**- మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి.**

పల్లె వెలుగు మార్కాపురం. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి



మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డులో " ఆర్ట్ ఆఫ్ లివింగ్" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి తెలుగుదేశం నాయకులతో కలిసి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఆర్ట్ ఆఫ్ లివింగ్" గురు "ఆర్ట్ ఆఫ్ లివింగ్" ఎలా నేర్చుకోవాలో ప్రాక్టికల్ గా చేసి చూపించారు. సాధన అనంతరం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ శ్వాసపై ధ్యాస ఉంచితే మనిషికి ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా మనిషి శరీరంలోని అవయవాలు ఉత్తేజం అవుతాయని శరీరం కూడా మానసింగా మరియు శారీరకంగా ఆరోగ్యంగా ఉంటుందని ప్రతి ఒక్కరు దైనందిక జీవితంలో ఒక అరగంట "ఆర్ట్ ఆఫ్ లివింగ్" ప్రాక్టీస్ చేయాలని తద్వారా మనిషి ఆరోగ్యంగా ఏ రకంగా జీవించవచ్చునో తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బి . కోడూరు మండలం అంగన్‌వాడీ టీచర్లకు ఘన సన్మానం

బి.కోడూరు, సెప్టెంబర్ 28 ( పల్లె వెలుగు):ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బి . కోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ శ్రీదేవి, సూపర్వైజర్ సుగుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవిచంద్ర ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ఘనంగా సన్మానించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ఎదుగుదలతో పాటు విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడం, చిన్నారుల ఎదుగుదలను పర్యవేక్షించడం, విద్యకు పునాది వేయడం వంటి కార్యక్రమాలు సమర్థవంతంగాఅమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, కడప జిల్లా ఉపాధ్యక్షులు తిప్పలూరు రామసుబ్బారెడ్డి, బి ఎల్ ఎ -1 మరియు బి కోడూరు మండలం ఇంచార్జ్ బిజివేముల భాస్కర్ రెడ్డి, బి కోడూరు మండల అధ్యక్షుడు పోలుబోయిన రవిచంద్ర, కడప జిల్లా ఓబీసీ కార్యదర్శి మున్నెల్లి చిన్నగురయ్య, బద్వేల్ రూరల్ మండల అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, కడప జిల్లా కిసాన్ మోర్చా ఉప అధ్యక్షులు గాజులపల్లి శివా రెడ్డి, మౌనిక, కేశవరెడ్డి, మంజుల రామకృష్ణ,దొమ్మర శ్రీను, వంకదారి జయరామ్ , నుస్సుం గురప్ప,తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



## రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఎన్ హెచ్ హైవే మేనేజర్ రసూల్

.పోరుమామిళ్ల, సెప్టెంబర్ 28(పల్లె వెలుగు ):



హైవే 6 లైన్ రోడ్ దాదాపు 23 కిలోమీటర్ల మేర మల్లేపల్లి నుంచి చెన్నారెడ్డి పేట గ్రామం వరకు వచ్చిందని, హైవే నిర్మాణంలో నష్ట పోయిన రైతుల పొలాలకు సంబంధించి రావాల్సిన నష్ట పరిహారం ఇంకా 40 శాతం వరకు మిగిలివుందని, వెంటనే ఇప్పించాలని చెన్నారెడ్డి పేట రైతులు మురళీ మోహన్ రెడ్డి, సిద్దు గురివిరెడ్డి, అంబవరం గురివిరెడ్డి, ప్రతాప్ రెడ్డి కోరుతున్నారు. .రెవిన్యూతో కుమ్మక్కైన ఎన్ హెచ్ హైవే మేనేజర్ రసూల్ తో రైతులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్య లేకపోయినా, సమస్య ఉన్నట్లు సృష్టించి రైతుల వద్ద నుంచి భారీగా డబ్బులు దండుకోవడమే కాకుండా చెన్నారెడ్డిపేట నుంచి మట్టి, గ్రావెల్ తో పాటు, చెన్నారెడ్డిపేట కొండనుంచి కూడా అక్రమంగా మట్టి తోలుతున్నాడనిని ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. ఎవరు డబ్బులు ఇస్తే వాళ్లకు పనులు ఇస్తున్నాడని, రైతులను ఇష్టం వచ్చినట్లు భూతులు మాట్లాడుతున్నాడని, ఈయన వేధింపులు తట్టుకోలేక ఒక రైతు ఆత్మహత్య ప్రయత్నం కూడా చేశారని మురళి మోహన్ రెడ్డి చెబుతున్నారు. ముడుపులు ముడితేనే ఫైళ్లు కదిలిస్తూ వున్నాడని చెబుతున్నారు. రసూల్ ను ప్రసన్నం చేసుకొని 2 నుంచి 3 శాతం కమీషన్ ఇస్తేనే సహకరిస్తున్నాడని రైతులు బాధను వ్యక్తం చేస్తున్నారు. లోకల్ సబ్ కాంట్రాక్టర్ల వద్ద నుంచి కూడా 2 నుంచి 3 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నాడని, డబ్బులిస్తేనే బిల్లులు చేయిస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని సబ్ కాంట్రాక్టర్లు కూడా బాధను వెలిబుచ్చుతున్నారు. సంబంధిత అధికారులు, కంపెనీ పెద్దలు రసూల్ పై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అతనే రైతులకు సమస్య సృష్టించి అతనే పరిష్కరిస్తున్నాడని ఇది మంచి పద్దతి కాదని, దుర్మార్గమైన చర్య అని, ఇతని అక్రమాలు అరికట్టాలని కోరుతున్నారు. రసూల్ నుంచి తమ



గ్రామ రైతులను కాపాడి, వాళ్లకు రావాల్సిన డబ్బులు వెంటనే పడేలాగ చూడాలని, రైతులను కష్టాలనుంచి గట్టెక్కించాలని మురళి మోహన్ రెడ్డి కోరుతున్నారు.

...అలాగే చెన్నారెడ్డిపేటకే చెందిన సిద్దారెడ్డి మాట్లాడుతూ... హైవే కు ఇరువైపులా వున్న తన పొలాలు సర్వే నెంబర్ 216/7 లో 41 సెంట్లు, 23/6 లో 33 సెంట్లు,23/3 లో 9సెంట్లు, 11/14లో 35 సెంట్లు,16/15 లో 24 సెంట్లు పోతోందని, ఇంతవరకు నాకు ఒక్క రూపాయి కూడా పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రసూల్ ను అడగ్గా నా పర్సంటేజ్ నాకిస్తే చేయిస్తాను అంటున్నాడని చెబుతున్నారు. నాకు డబ్బులు పడకపోవడంతో పనులు జరగకుండా ఆపి వున్నాను అని చెబుతున్నారు. తన భూమి మొత్తం హైవే లో 1 ఎకరా 70 సెంట్లు పోయిందని చెబుతున్నారు. నాపొలాలు 4 నుంచి 5 కోట్ల విలువ చేస్తాయని నష్టపరిహారం పెంచమని అడిగితే మీది అవార్డు అయింది పెంచడం కుదరదు అంటున్నారని, తహసీల్దార్, ఆర్డీఓ ల చుట్టూ తిరిగి వేసారిపోయాను అని రైతు సిద్దయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .

## కాణిపాక వినాయకుడికి పట్టువస్త్రాల సమర్పణ



**మహానంది, పల్లె వెలుగు**

మహానంది క్షేత్రంలోని శ్రీ కామేశ్వరి మహానందీశ్వర స్వామి వార్ల తరపున కాణిపాకంలో వెలసిన వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం ఈవో శ్రీనివాసరెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి సంవత్సరం వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల సమయంలో మహానంది దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమరిస్తున్నట్లు వారు తెలిపారు. కాణిపాక ఆలయ ఈవో,చైర్మన్ మణి నాయుడు , ఏఈవో ధనుంజయ అర్చకులు, వేదపండితులు మహానంది దేవస్థానం చైర్మన్, ఈవో, వేద పండితులు, అర్చకులు, ధర్మకర్త మండలి సభ్యులను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సంప్రదాయ బద్దంగా మేళతాళాలతో స్వయంభు వరసిద్ధి వినాయకస్వామికి



పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం మహానంది, కాణిపాకం దేవస్థానాల ఈవోలు,చైర్మన్లు పరస్పర సత్కారాలు



అందుకున్నారు. వీరి వెంట మహానంది ఆలయ ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య,ధర్మకర్త మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన,

**-ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ,,,**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 28



ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పరామర్శించి, వారి కుటుంబాలకు అండగా నిలిచారు. ముందుగా సంజీవయ్య నగర్‌కు చెందిన ఉప్పర మేకల కర్రెన్న



అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పాపిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో పార్టీ, తాను కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం కందనాతి గ్రామానికి చెందిన టీడీపీ ఎమ్మిగనూరు మండల ఉపాధ్యక్షులు కేశన్న ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, క్లస్టర్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ గ్రామ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించిన,,

**ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ,,,,,,**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 28 ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గుడికల్ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి గ్రామ టీడీపీ నాయకులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ కమిటీతో సమావేశమై పార్టీ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం బోయ నరసింహులు ని టీడీపీ గ్రామ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నుకున్నారు. తదుపరి పీఏసీఎస్ డైరెక్టర్, యూనిట్ కన్వీనర్ దేవదాసు నివాసాన్ని



ఎమ్మెల్యే సందర్శించి, పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, క్లస్టర్ కన్వీనర్లు, స్థానిక నాయకులు, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లె వెలుగు కథనానికి స్పందన

## స్పందిస్తున్న దాతలు





పల్లె వెలుగు

బ్లడ్ క్యాన్సర్ కు గురైన డిగ్రీ విద్యార్థి

దాతల సహాయం కోసం ఎదురుచూపులు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 28: బ్లడ్ క్యాన్సర్ కు గురైన డిగ్రీ విద్యార్థి అన్న శీర్షికన పల్లె వెలుగులో సోమవారం వెలువడిన కథనంపై దాతలు స్పందిస్తున్నారు. క్యాన్సర్ వ్యాధికి గురై ప్రస్తుతం చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అడ్డాకుల కార్తీక్ కథనం పలువురిని స్పందింపజేసింది. ఈ విషయంలో మానవతావాదులు, పలువురు అధికారులు స్పందించారు. బాధిత కుటుంబానికి ఉడతా భక్తి సాయంగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. పల్లె వెలుగులో కథనం చదివిన వెంటనే తహసిల్దార్ పద్మావతమ్మ 2000 రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి పంపించారు. ఏ కోడూరు కు చెందిన మన్నే కుమార్ 2000 సాయాన్ని పంపించారు. బండి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు మౌలాలి 2000 రూపాయలు, ప్రసాద్ 2000 రూపాయలు రామ తులసి వెయ్యి రూపాయలు, శివరామకృష్ణ చారి వేయి రూపాయలు ఇలా ఒక్కొక్కరు కార్తీ కుటుంబానికి వాట్సాప్ ద్వారా నేరుగా ఆర్థిక సహాయం అందించారు. కళాశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు, సన్నిహితులు కార్తీ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. ఈ విషయంపై కళాశాల లెక్చరర్లు ప్రసాద్, శివరామకృష్ణ చారి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయడంలో తమ వంతు సహకారం అందజేస్తున్నారు. కార్తీక్ పేరిట ప్రత్యేకంగా ఫ్లెక్సీ బ్యానర్ తయారు చేయించి క్యాన్సర్ తో బాధపడుతున్న పేద విద్యార్థికి విరాళాలు సేకరించేందుకు కార్తీక్ మిత్ర బృందం ప్రయత్నాలు చేస్తూ ఉంది. బ్లడ్ క్యాన్సర్ తో పోరాడుతున్న కార్తీక్ అనే డిగ్రీ విద్యార్థి కథనాన్ని పల్లె వెలుగులో ప్రసారం చేయడం వల్ల దాతలు ఆదుకుంటున్నారని, ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన పల్లెవెలుగు దినపత్రికకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉంది.

NEWS • NEWS • NEWS • NEWS • NEWS NEWS

పల్లెవెలుగు

కథనంతో స్పందించిన అధికారులు

# కూటమి పాలనలో దళితులపై మారణకాండ: బీఎస్పీ ధ్వజం

## కర్నూలు కలెక్టరేట్ ఎదుట బహుజన్ సమాజ్ పార్టీ మహాధర్నా



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, హత్యలు పెరిగిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 27 మంది దళితులు హత్యకు గురైనా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందేల గౌతమ్ కుమార్ పిలుపు మేరకు కర్నూలు కలెక్టరేట్ ఎదుట సోమవారం పార్టీ ఆధ్వర్యంలో 'దళితుల మారణకాండ' పేరిట మహాధర్నా నిర్వహించారు.
ఈ నిరసన కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జ్ గాడి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రామలింగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో దళిత కుటుంబాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలి ఒక్క కర్నూలు జిల్లాలోనే కామవరం శివన్న, చిప్పగిరి లక్ష్మీనారాయణ, బొందిమడుగుల టి.ఎం. రమేష్, సతీష్, కర్నూలు మనోహర్, సంజన, కల్కుంట గోవిందమ్మ, గుండమ్మ, జానకమ్మ, ఆరోస్మిత్త, బురుజుల తదితర దళితులపై కులాంతర వివాహాలు, పంచాయతీ రాజకీయాలు, ఆర్థిక ఎదుగుదలను ఓర్వలేక దాడులు చేసి పొట్టనబెట్టుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, ఒక్కో కుటుంబానికి రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో బీఎస్పీ జిల్లా సలహాదారులు సుంకన్న, శాంతరాజు, కోశాధికారి సలీం బాషా, కార్యదర్శి నాగన్న, కర్నూలు సిటీ కన్వీనర్ సాదిక్ బాషా, బిఎస్ఎఫ్ రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జ్ బొగ్గుల హనుమన్న, పత్తికొండ డివిజన్ అధ్యక్షుడు అశోక్, ఆలూరు అధ్యక్షుడు కొమ్ము రమేష్, మంత్రాలయం అధ్యక్షుడు బోయ రవికుమార్, ఎమ్మిగనూరు అధ్యక్షుడు ఆంధ్ర బంగారప్ప, కోడుమూరు అధ్యక్షుడు భాస్కర్, ఆదోని అధ్యక్షుడు ఫయాజ్ బాషా, నేతలు అబ్రహాం, యేసు, రామాంజనేయులు, బాలు, రాజు, మండల కమిటీ సభ్యులు యోగానంద, యోసేపు, లింగన్న, లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 28 25 కోట్ల భారతీయుల చిన్నారుల కలలు దేశవ్యాప్తంగా చిత్రలేఖనం ఒ వకృత్వ పోటీలు స్థానిక వీవర్స్ కాలనీ హై స్కూల్ నందు నిర్వహించడం జరిగింది మన దేశ ప్రధానమంత్రి వర్యులు శ్రీ నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా
25 కోట్ల భారతీయుల చిన్నారుల కలలు దేశవ్యాప్తంగా చిత్రలేఖనం ఒ వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. చిత్రలేఖనం మరియు వక్రత్వ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు జిల్లా అధికార ప్రతినిధి ఎమ్మిగనూరు నియోజకవర్గ బిజెపి నాయకులు గురురాజు దేశాయ్ బహుమతులను ప్రధానం చేశారు. దీనిలో భాగంగా మొదటి రెండవ మూడవ బహుమతులు ఇస్తూ 60 మంది విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. గురురాజు దేశాయ్ మాట్లాడుతూ మోడీ వికసిత్ భారత్ 2047 వికసిత్ అంటే అభివృద్ధి చెందిన భారతదేశం 1947 లో మనకు స్వాతంత్ర్యం వచ్చింది. 2047 కి 100 ఏళ్ళు పూర్తవుతాయి. ఆ నాటికి మన భారత్ దేశం ప్రపంచంలో మొదటి మూడు సంపన్న దేశాలలో ఒకటిగా ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ కల. 2022 లో ఎర్రకోట నుండి మోడీ గారు ఈ పిలుపు ఇచ్చారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివర్స్ కాలనీ హై స్కూల్ హెడ్మాస్టర్ నాగభూషణ్ రెడ్డి సార్ మరియు స్కూల్ ఉపాధ్యాయులు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బి ఎల్ నారాయణ , ఎల్ ఎల్ సి కాల్వ చైర్మన్ రామన్న గౌడ్ , 3 వార్డ్ గనప వీరేష్ ఎస్సీ మోర్చా కల్లెల శివ ,పట్టణ ఉపాధ్యక్షులు సురేంద్ర, వెంకటేష్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి, నందవరం మండల అధ్యక్షుడు దండు వీరేష్, ఎమ్మిగనూరు పట్టణ 23 వ వార్డ్ జంగాల జమ్మన్న 24 వార్డు రంగస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి చేనేత శివ, తిమ్మప్ప, పంపయ్య ,కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.




# పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ..

పాణ్యం సెప్టెంబరు 28 పల్లె వెలుగు : విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌పై ప్రత్యక్షంగా పనిచేయడం ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎడ్యూ సిల్ఫ్ టెక్నికల్ సపోర్ట్ నిపుణులు ప్రసాద్ కంటూ తెలిపారు. ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 'ఫ్లూయిడ్ డైనమిక్స్ స్టూడెంట్ టెక్ క్యాంప్' సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫ్లూయిడ్ డైనమిక్స్ సాఫ్ట్‌వేర్ అనువర్తనాలు, పరిశ్రమల్లో వాటి వినియోగం, ఆధునిక డిజైన్ సిమ్యులేషన్ సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, హెచ్ఓడీ డాక్టర్ తిరుపతిరెడ్డి, కోఆర్డినేటర్ ఉపేంద్ర పాల్గొన్నారు.




# యాగంటి దేవస్థానానికి విరాళం



బనగానపల్లె , సెప్టెంబర్ 28, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీయాగంటి శ్రీమామహేశ్వర స్వామి దేవస్థానానికి బనగానపల్లె పట్టణానికి చెందిన ఆర్.సుబ్బారెడ్డి రూ.10120/- విరాళంగా ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి, ఆలయ ఈవో పాండురంగారెడ్డి లకు అందజేశారు. దాతకు ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందజేశారు.

# శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నకు విరాళం



బనగానపల్లె సెప్టెంబర్ 28,పల్లెవెలుగు మండలం లోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు కడప జిల్లా, ఖాజీపేట మండలం, రంగాపురం గ్రామ వాస్తవ్యులు పట్టుపోగుల చంద్రయ్య వారి ధర్మపత్ని చౌడమ్మ వారి కుమారుడు బాబు వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 50,201/- రూ" చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి గారు,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి గారి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.

# ఇళ్ల స్థలాల మంజూరు కై ఆర్డీఓ కు దివ్యాంగుల వినతి

బనగానపల్లె, సెప్టెంబర్ 28, పల్లెవెలుగు బనగానపల్లె డివిజన్లోని అర్హులైన



దివ్యాంగులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆర్డీవో నరేంద్ర నాథ్ రెడ్డికి నంద్యాల జిల్లా దివ్యాంగ జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు నేతృత్వంలో ఎమ్మార్వో కార్యాలయంలో ఆయనను కలవడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా దివ్యాంగులకు సరియైన ఇళ్ల స్థలాలు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయనకు దివ్యాంగుల చేసి బృందం వినిపించుకోవడం జరిగింది ఆర్డిఓ గారు సానుకూలంగా స్పందించి అర్హులైన దివ్యాంగులందరికీ న్యాయం చేస్తానని ముఖ్యంగా కూలింగ్ మండలంలో దివ్యాంగులకు ఖాళీ స్థలంలో దివ్యాంగుల కాలనీ ఏర్పాటుకు కూడా ప్రయత్నం చేస్తానని ఆర్డిఓ గారు దివ్యాంగుల జేఏసికి హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగ చేసి ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీనివాసులు కొలిమిగుండ్ల కోవెలకుంట్ల బనగానపల్లె ఉయ్యాలవాడ మండల దివ్యాంగ అధ్యక్షులు సుబ్బరాయుడు పుల్లన్న అజీజ్ భాష మద్దిలేటి ఇతర దివ్యాంగులు పాల్గొన్నారు

# గోరుకల్లు ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి..!

## -పునరావాసం కింద పాణ్యం సమీపంలో ఇళ్ల నిర్మాణానికి విజ్ఞప్తి..

పాణ్యం సెప్టెంబరు 28 పల్లె వెలుగు : గోరుకల్లు రిజర్వాయర్ గేటును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తివేయడంతో కాల్వలోకి ఒక్కసారిగా భారీగా నీరు రావడంతో గ్రామంలోకి వరదనీరు ప్రవేశించి ప్రజలు భయంతో పరుగులు పెట్టాల్సి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతిపత్రం అందజేసి కోరారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా గ్రామస్థులకు పునరావాసం కింద పాణ్యం సమీపంలో స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామస్థుల సమస్యలను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సానుకూలంగా స్పందించి,ఇప్పటికే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యే చరితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# తృప్తి తరంగాలు సంతోష తీరాలు

పల్లె వెలుగు:ఆశల అగాధం దాటిన నాడు హృదయం ఒక నందన వనమౌతుంది.అంతూ లేని కాంక్షలు వీడిన క్షణాన సంతోషం ఉప్పొంగుతుంది.ఉన్నదానితో మురిసిపోయే గుణమే జీవితానికి నిండైన అందం కలలు కంటూనే సాగాలి.ప్రయాణం కలలు కనడం ప్రగతికి మూలం ప్రయత్నం మానవ ధర్మం కానీ భ్రమల వెనుక పరిగెత్తుడం.వృధా ప్రయాసల మర్మం కోట్లు కూడబెట్టినా దక్కని ఆ నిచ్చింత నవ్వులో ఉంది.ఆత్మీయతఓ మనిషి వెండి కనకం వజ్ర వైడుర్యాలు కూడబెడు తున్నావు.కానీ అమూల్యమైన సంతోషాన్ని కోల్పోతున్నావు.నింగిని చూడు నేలను చూడు ప్రకృతినుండి పాఠం నేర్చుకో.పారే సెలయేటి అలల సవ్వడిలో ఎన్నెన్ని సంతోషాలు ఉన్నాయో గమనించుకో.ప్రతి ఉదయం ఒక కొత్త వరమంటూ ఈ జీవన లయను ఆస్వాదించుకో.సంతృప్తి అనే అమృత భాండాన్నినీగుండెల్లో నింపుకోఆస్తులు అంతస్తులు అధికారాలు ఆడంబరాలు కాదు మనశాంతే పరమ భాగ్యం.ప్రేమతో పంచే ఆనందమే మానవ జన్మకు సార్థకం.నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం రచయిత కాలమిస్ట్ కరీంనగర్.



## జెడ్పీటీసీ నిధులతో రహదారి అభివృద్ధి..

# ఏళ్ల సమస్యకు పరిష్కారం

పోరుమామిళ్ల, సెప్టెంబర్ 28 ( పల్లె వెలుగు): పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ పరిధిలోని



ఒకటో సచివాలయం ప్రధాన రహదారిని ఈరోజు సందర్శించి పరిశీలించారు. పోస్ట్ఆఫీస్, కృష్ణశారద కాలేజీ, రామాయపల్లి వెళ్లే మార్గం కావడంతో ఈ రహదారిపై నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షాకాలంలో రహదారి పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జెడ్పీటీసీ నిధుల నుంచి మాజీ జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ రూ.15 లక్షలతో కృష్ణశారద కాలేజీ నుంచి ఒకటో సచివాలయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం రహదారిని సందర్శించడంతో పాటు పరిస్థితిని పరిశీలించారు. సిమెంట్ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గి సౌకర్యం కలగనుంది.

## పొడి చెత్త ఇవ్వండి.. కూపన్లు పొందండి

మహానంది, పల్లె వెలుగు  ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని పొడి చెత్తను పంచాయతీకి



అందించి, లక్కీ డ్రీప్ కూపన్లు పొందాలని ఎంపీడీవో మహబూబ్ దౌలా పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులకు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద వర్మీ కంపోస్ట్ ఉత్పత్తిపై శిక్షణ ఇచ్చారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఘన వ్యర్థాల నిర్వహణ, తడి--పొడి చెత్త వేరు చేయడం బిన్ బాగ్ విధానం, వర్మీ కంపోస్ట్ తయారీ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. అక్టోబర్ 1వ తేదీన దసరా పండుగను పురస్కరించుకొని పంచాయితీలలో ప్రజల భాగస్వామ్యంతో 'దసరా ధమాకా- స్వచ్ఛ రథం' అనే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. 10 కేజీలకు పైగా పొడి చెత్తను పంచాయతీకి అందించిన వారికి లక్కీ డ్రాలో పాల్గొనడానికి ప్రత్యేక కూపన్ ఇస్తామన్నారు. ఈ వినూత్న అవకాశాన్ని గ్రామస్తులందరూ వినియోగించుకుని తమ ప్రాంతాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.

## కండ్లకు గంతలు కట్టుకుని 12వ రోజు వీఆర్ఏల నిరసన

బనగానపల్లె, సెప్టెంబర్ 28, పల్లెవెలుగు  న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని



వీఆర్ఏలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం వీఆర్ఏల నిరసన 12వ రోజుకు చేరుకుంది.వీఆర్ఏలు నిరసన చేస్తున్న సమయంలో ఆర్డీఓ నరేంద్రనాథ్ రెడ్డి, తహసీల్దార్ చంద్ర శేఖర్ సమ్మె శిబిరం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ నరేంద్ర నాథ్ రెడ్డికి అందజేశారు. ఆర్డీఓ నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ వీఆర్ఏలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు, డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు కండ్లకు గంతలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వీఆర్ఏలు తెలంగాణ తరహాలో పే స్కేలు అమలు చేయాలని, వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, నామినీ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, 60 ఏళ్లు పైబడిన వీఆర్ఏల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం అధ్యక్షులు గౌస్‌పీరా, వైస్ ప్రెసిడెంట్ తలారి బాలుడు, నాయకులు తలారి సుబ్రహ్మణ్యం, కే. హరిబాబు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం



బనగానపల్లె , సెప్టెంబర్ 28, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వణ అధికారి పాండురంగారెడ్డి , ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి ,పాతపాడు మాజీ సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి , సభ్యులు భరతుడు, జె.సురేష్, మల్లేష్ రెడ్డి, మహేష్ రెడ్డి, భక్తులు, అర్చకులు ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామ పంచాయతీలలో "దసరా ధమాకా"

**-మహిళలకు ప్రోత్సాహకాలుగా డిన్నర్ సెట్లు, రైస్ కుక్కర్లు, చీరలు**



బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 28: దసరా పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని స్వర్ణ గ్రామపంచాయితీలలో ప్రజల భాగస్వామ్యంతో దసరా ధమాకా అనే నూతన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం ఈనెల 25 నుండి ప్రారంభం కాగా అక్టోబర్ 25వ తేదీ వరకు నిర్వహించాలని, స్వచ్ఛత అవగాహన మాస ఉత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు తప్పనిసరిగా అధికారులు అందరూ చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ముందస్తుగా కార్యక్రమం పై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. తమ ఇళ్లలో నిల్వ ఉన్న పొడి చెత్తను స్వచ్ఛరతానికి అందించేలా మహిళలను ప్రోత్సహించాలి. 10 కేజీలకు మించి అత్యధికంగా చెత్తను , వ్యర్థ పదార్థాలను అందజేసిన కుటుంబాలకు ప్రత్యేకంగా కూపన్లు ఇస్తారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సేకరించిన కూపన్ల నుండి లక్కీ డీప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులను ఇస్తారు. ఇందులో మొదటి బహుమతిగా డిన్నర్ సెట్ రెండవది రైస్ కుక్కర్ ,మూడవ బహుమతి క్రింద మూడు చీరలను



ఇస్తారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛ రథం పర్యటించే సమయం మార్గాన్ని ప్రజలకు అధికారులు ముందుగానే తెలియజేయాల్సి ఉంటుంది. స్వచ్ఛరథం గ్రామానికి వచ్చే రోజు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ తప్పనిసరిగా స్వచ్ఛ రథం వెంట ఉండి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ప్రజలను స్వయంగా భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. గ్రామాలలో ఫ్లెక్సీలు బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు స్వర్ణ గ్రామం పాఠశాలలు మహిళా సంఘాలను ఇందులో భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. స్వచ్ఛతపై నినాదాలు ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రతిరోజు సేకరించిన చెత్త వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్లు ,డిప్యూటీ ఎంపీడీవోలతో పాటు ఎంపీడీవో మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించాలి ఉంటుంది. అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించాలి. అత్యధికంగా పొడిచెత్తని సేకరించిన విద్యార్థులకు ప్రత్యేకంగా గుర్తింపు ఇవ్వాలి. నా ఇల్లు, నా బాధ్యత, నా గ్రామం, నా స్వచ్ఛత అనే అంశాలపై పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని సాధారణ పారిశుద్ధ్య కార్యక్రమం



కాకుండా ఫెస్టివల్ మోడ్ లో నిర్వహించాల్సి ఉంటుంది.

**123 పంచాయతీలలో దసరా ధమాకా**

**డి ఎల్ డి ఓ అన్వరా బేగం**

ఆత్మకూరు డివిజన్ పరిధిలో 123 గ్రామపంచాయతీలలో దసరా ధమాకా కార్యక్రమాన్ని చేపడుతున్నామని డి ఎల్ డి ఓ అన్వరా బేగం తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలను మండల పరిషత్ అధికారులకు పంపడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయంపై పాములపాడు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులతో సమావేశాన్ని నిర్వహించి దసరా ధమాకా కార్యక్రమం పై డిఎల్డిఓ అవగాహన కల్పించారు. వర్మీ కంపోస్ట్ తయారీపై సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చారు. గ్రామాలలో డి ఎల్ డి వో ఇంటింటా తిరిగి చెత్త సేకరణ విషయంలో మహిళ అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఎన్నికల సంఘం స్వతంత్రతను దెబ్బతీస్తున్న సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి - సిపిఎం డిమాండ్

బేతంచెర్ల, పల్లె వెలుగుసెప్టెంబర్ 28: ఎన్నికల




సంఘం స్వతంత్రతను,విశ్వసనీయతను దెబ్బతీసిన భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని సిపిఎం ప్రధాన కార్యాలయం పిలుపులో భాగంగా బేతంచెర్ల పాత బస్ స్టాండ్ సెంటర్ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వై.ఎల్లయ్య, వి.సుబ్బరాయుడు, బి.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రమాదంలో ప్రజాస్వామ్యం నడుస్తోందని అన్నారు.ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తో పాటు మరో ఇద్దరు కమిషనర్లు సమాన హోదా కలిగిన వారని, ఏవైనా భిన్నాభిప్రాయాలను మెజారిటీ లేదా ఏకాభిప్రాయంతో పరిష్కరించుకోవాలని అన్నారు. అలా కాకుండా సీఈసీ జ్ఞానేష్ కుమార్ మెజారిటీ అభిప్రాయాన్ని బేఖాతరు చేస్తూ తాను ఒక్కరే నిర్ణయం తీసుకోవడం, బీజేపీ కేంద్ర ప్రభుత్వం వెనుక నుండి కమిషనర్ ను నడిపించడం అంటే ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు అని అన్నారు.బీజేపీ జేబు సంస్థగా భారత ఎన్నికల సంఘం పనిచేయరాదని అన్నారు. ఎస్.ఐ.ఆర్ పేరుతో 13 కోట్ల మంది ఓటర్లను తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, ఆర్.మద్దయ్య, డి.రాజు, అయ్యన్న, లోకేష్, ధనుంజయుడు, షఫీ, నాగరాజు, వెంకట రాముడు, వెంకటేశ్వర నాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి- మంత్రులు

బనగానపల్లె, సెప్టెంబర్ 28, పల్లెవెలుగు కూటమి పాలనలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

**అభివృద్ధి చేసే వారిని ఆదరించండి- మంత్రి బీసీ**

అభివృద్ధి చేసే వారిని ఆదరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, న్యాయ మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లు షాదీ ఖానాను ప్రారంభించారు. అనంతరం జరిగిన




మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ లు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ముస్లిం మైనార్టీల కోసం రూ 2.60 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించిన షాది ఖానా భవనాన్ని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి ఎన్.ఎం.డి ఫరూక్ లు ప్రారంభించారు. ప్రభుత్వ నిధులు రూ. 1 కోటితో పాటు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సొంత నిధులు రూ 1.60 కోట్లు వెచ్చించి నూతన షాది ఖానా భవనాన్ని నిర్మించారు .మరో రూ. 18 లక్షల మంత్రి బీసీ సొంత నిధులతో వంట పాత్రలు, షామియానాకు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి కూటమిపాలనలో అభివృద్ధి సాధ్యమన్నారు. వైసిపి ఐదు సంవత్సరాల పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. టిడిపి పాలనలో మంజూరైన అభివృద్ధి పనులను వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డుకుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఐదు సంవత్సరాలు ఎలాంటి అభివృద్ధి చేయకుండా కక్ష సాధింపు, అక్రమ కేసులు తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు .అభివృద్ధి చేసేవారిని ప్రజలు ఆదరించాలని కోరారు. బనగానపల్లె ముస్లింలంటే తనకు ఎంతో ప్రేమని వారికోసం రెండు కోట్ల 60 లక్షలతో షాదిఖాన నిర్మించినట్లు తెలిపారు. పట్టణంలో నవాబుల కాలంలో 80 సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ కాలువలు శిథిలావస్థకు చేరుకొని మురుగునీరు వెళ్లక ప్రజలు దోమల బాధతో, దుర్వాసనతో ఇబ్బందులు పడుతుంటే 90 కోట్ల రూపాయలతో పట్టణంలో అండర్ డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**టిడిపి పాలనలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి గుర్తింపు- ఎన్ఎండి ఫరూక్**

టిడిపి ప్రభుత్వం 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాతనే ముస్లిం మైనార్టీలకు షాదిఖానాలు, మసీదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు న్యాయ మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. టిడిపి పాలనలో ముస్లింల రక్షణ, గుర్తింపు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు .మైనార్టీలు టిడిపి ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో బనగానపల్లె నవాబ్ వంశీయులు మీర్ ఫజల్ అలీ ఖాన్, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ ఖాద్రి, ఎన్ఎండి ఫయాజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కాత్రెడ్డి మల్లికార్జున రెడ్డి, పట్టణ మాజీ ఉపసర్పంచ్ బురానుద్దీన్, భానుముక్కల సహకార సంఘం అధ్యక్షులు అత్తార్ అబ్దుల్ కలాం, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు ,టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, టిడిపి నాయకులు అత్తార్ అను, అల్తాఫ్ హుస్సేన్, సయ్యద్ హుస్సేన్ నియాజీ, సంఘం హోటల్ హైదర్, పంచాయతి రాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఎంపీడీవో నాగరాజు, గ్రామపంచాయతీ ఈవో మురళీమోహన్, ముస్లిం మత పెద్దలు, ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల ప్రజావేదికలో వచ్చిన దరఖాస్తులను

# వేగవంతంగా పరిష్కారం చూపాలి.

**పిజిఆర్ఎస్‌కు 299 దరఖాస్తులు.**

**జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్ర



ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందని పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత పరిష్కారం చూస్తూ అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా 299 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అధికారుల పిజిఆర్ఎస్ లాగిన్‌లలో ఇప్పటివరకు పరిశీలించని 135 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే ఓపెన్ చేసి పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని, బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. రీఓపెన్ అయిన దరఖాస్తుల్లో ఇంకా 13 అర్జీలు పరిష్కరించాల్సి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, ప్రతి అర్జీపై తీసుకున్న చర్యలను పిజిఆర్ఎస్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 158 అర్జీల స్వీకరణ**

రెవెన్యూ క్లినిక్స్ ద్వారా జిల్లాలో మొత్తం 158 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 3, అడంగల్ సవరణలకు 17, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించి 18, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 25, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించి 53, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 35, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 7 దరఖాస్తులు ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. రెవెన్యూ క్లినిక్స్‌లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) పురపాలక ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షరీఫ్ తన ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో జమైన నగదును ఉపసంహరణ చేసుకొనుటకు అవకాశం ఇవ్వడం లేదని కేవలం అసలు నగదుపై జమైన వడ్డీ మాత్రమే ఉపసంహరణకు అవకాశం ఇస్తున్నారని, మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ నిధులపై సమగ్ర విచారణ చేపట్టి ప్రావిడెంట్ ఫండ్ ఖాతా నుండి అవసరమ మేరకు నగదు ఉపసంహరణకు అవకాశం కల్పించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) నంద్యాల మండలం, అయ్యలూరు గ్రామానికి చెందిన నాగప్ప సర్వే నెం.402/1లో 4.23 ఎకరాలు, 403/ఎలో 1.13 ఎకరాలు, 403/బిలోని 0.47 ఎకరాల పొలాన్ని సాగు చేసుకుంటున్నారని, ప్రస్తుతం సదురు భూమి సర్వీసు ఈనామ్ నుండి తొలగించగలరని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

3) సిరివెళ్ల మండలానికి చెందిన కొల్లి ఓబన్నకు సర్వే నెం.975/2లో 0.25 సెంట్ల భూమి కలదని, సదురు భూమి సబ్ రిజిస్టర్ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా చూపుతోందని విచారణ జరిపి సదురు పొలాన్ని ప్రభుత్వ భూరికార్డుల నుండి తొలగించగలరని జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 138 ఫిర్యాదులు.

**చట్ట పరిధిలో సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు.**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా



పోలీస్ కార్యాలయంలో సోమవారం ( 28-09-2026) నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఫిర్యాదిదారుల నుంచి 138 ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు.

**ఫిర్యాదులలో కొన్ని.....**

1).కొలిమిగుండ్ల గ్రామం సర్వే నెంబర్ 75/2కే లో 2.13 సెంట్ల వ్యవసాయ భూమి మా పూర్వీకుల నుండి మాకు సంక్రమించిందని సదరు భూమిని కాశీపురం గ్రామానికి చెందిన ఏసన్న శేఖర్ వారు అక్రమంగా ఆన్లైన్లో ఎక్కించుకొని, మా పొలంలోకి అక్రమంగా ప్రవేశించి ట్రాక్టర్ తో పొలం దున్నుతున్నారని, మా పొలంలోకి మేము వెళ్లకుండా ఆటంకం కలుగజేస్తున్నారు. కావున మాయందు దయవుంచి మాకు న్యాయం చేయండని కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన రామచంద్రుడు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

2).నాకు ఐఫోన్ కావాలని సెల్ పాయింట్ రాజేష్ కు చెప్పగా దాని ఖరీదు 80,000 అవుతుందని చెప్పాడు దానికి అడ్వాన్స్ 50,000/-ఇస్తే తెప్పిస్తానని చెప్పడంతో 50,000/-ఫోన్ పే ద్వారా చెల్లించాను కానీ ఇంతవరకు ఫోను తెప్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా నన్ను మోసం చేసినాడని నాకు న్యాయం చేయండని నంద్యాల పట్టణానికి చెందిన ఖాజా మొహిద్దిన్ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

3).కొత్తపల్లి గ్రామం సర్వే నెంబర్ 1316 / 2 లో 47 సెంట్ల భూమిని 20 లక్షలకు అమ్ముతానని నా వద్ద నుండి నాలుగు లక్షలు డబ్బులు తీసుకుని మిగిలిన 16 లక్షలు ఇచ్చి పొలం రిజిస్ట్రేషన్ చేయమంటే చేయడం లేదని నాలుగు లక్షలు తిరిగి ఇవ్వడం లేదని, నాపై దయవుంచి నాకు న్యాయం చేయండని కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలి.

**నంద్యాల పట్టణంలో అక్టోబర్ రెండవ తేదీ జరుగు వామపక్ష పార్టీల ర్యాలీని జయప్రదం చేయండి.**

**సిపిఎం, సీపీఐ, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) వామపక్ష పార్టీల పిలుపు.**



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలో నీ సిపిఎం జిల్లా కార్యాలయం టీ, నరసింహయ్య భవనంలో వామపక్ష పార్టీల నేతలు తో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫ్రక్రుద్దీన్ సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు చౌడప్ప మాట్లాడుతూ కేంద్రా ఎన్నికల కమిషన్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని కోరుతూ వామపక్ష పార్టీల పిలుపు లో భాగంగా అక్టోబర్ రెండవ తేదీ నంద్యాల పట్టణంలో జరగబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జరగబోయే నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు ప్రజలు ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ హోం శాఖ మంత్రి అమిర్షా రాజ్యాంగ వ్యవస్థను నియంత్రిస్తున్నారని ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వారి వారి వారి కనుసన్నల్లో పనిచేసే 13 కోట్ల మంది ఓటర్లను తొలగించారని ఇది ప్రజాస్వామ్యానికి దేశానికి ప్రమాదకరమని దీనికి బాధ్యత వహిస్తూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుండి అన్యాయంగా తొలగించిన వారి ఓట్లను పునరుద్ధరించాలని ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సభ్యుడిగా చేర్చాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరగబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు నంద్యాల పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియను గుప్పెట్లో పెట్టుకొని వారికి కావలసిన అధికారాన్ని నిలబెట్టుకునే వీలుగా మోడీ అమిత్ షా కీలుగు బొమ్మ సి ఇ సి నీ తెచ్చిపెట్టి ఏకపక్షంగా చేసుకో పోయారని, ఇదే పద్ధతి అనుసరిస్తే దేశంలో ప్రజాస్వామ్యం బ్రతకదని తెలిపారు జ్ఞానేశ్ కుమార్ పై కేసు నమోదు చేసి విచారించాలని కోరారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల తీరుపై అనేక అనుమానాలు వస్తున్నాయని, ఫ్రీ అండ్ ఫెయిర్ గా ఎన్నికలు జరిగేలా చూడాలని ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై ప్రజలు చైతన్యం ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి రామచంద్రుడు నాయక్, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు డి శ్రీనివాసులు, సిపిఎం పార్టీ జిల్లా నాయకులు వెన్న బాలవెంకట్, దర్శనం లక్ష్మణ్, ఎమ్మార్ నాయక్, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కే ఎం డి గౌస్, వెంకటలింగం పాల్గొన్నారు.

## టి. నరసింహా రెడ్డి సబ్ - యూనిట్ ఆఫీసర్ పదవీ విరమణ సన్మానం

కాశినాయన,సెప్టెంబర్ 28 ( పల్లె వెలుగు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నరసాపురంలో



28/9/2026న డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్ప అధ్యక్షతన వారి వైద్య సిబ్బంది తరపున టి. నరసింహా రెడ్డిని ఘనంగా దుశ్శాలువతో సత్కరించి, పూలదండలతో అలంకరించి సన్మానించడం జరిగింది. ఇందులో భాగంగా డిప్యూటీ డీఎండహెచ్ఓ మల్లేష్, ఎక్స్ డిప్యూటీ డీఎండహెచ్ఓ మార్కారెడ్డి, బి.కోడూరు వైద్యాధికారులు వినీత్ కుమార్ రాజు, ఉదయకుమార్ రాజు, వారి వైద్య సిబ్బంది, కలసపాడు వైద్యాధికారి సాయితేజ, వారి వైద్య సిబ్బంది, టేకూరుపేట వైద్యాధికారులు, వారి వైద్య సిబ్బంది టి. నరసింహా రెడ్డి వైద్య ఆరోగ్య సేవలను కొనియాడారు. హెచ్ఈఓ సుబ్బారాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ బాలయ్య, వారి సిబ్బంది అందరూ కూడా సహకరించి నరసింహా రెడ్డి పదవీ విరమణ సన్మానాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచి వచ్చిన అధికారులు రమేష్ రెడ్డి, గణాంకాల అధికారి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జి. వెంకట రెడ్డి, డీపీఎంఓ నారాయణ సార్ ముఖ్యంగా హాజరయ్యారు. నరసాపురం గ్రామ అభివృద్ధికి, ప్రజలకు సేవలు అందించేందుకు అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఉచితంగా స్థల దాతలుగా ఉన్న దివంగత నేత కర్ణాటి శివా రెడ్డి కుమారుడు, ప్రస్తుత యువ నాయకుడు కర్ణాటి వెంకట రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నరసింహా రెడ్డి సేవలను కొనియాడారు.

## నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 28, పల్లె వెలుగు ఉయ్యాలవాడ మండల పరిధిలోని ఆర్.జంబులదిన్నె గ్రామ పొలిమేరలోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఉయ్యాలవాడ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందిన వెంటనే తమ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని, వారి వద్ద నుండి రూ. 5,200 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామిరెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాలి



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 28, పల్లె వెలుగు రానున్న మున్సిపల్ ఎలక్షన్లను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సమాయత్తం కావాలని నంద్యాల జిల్లా ఏఆర్ రిజర్వ్ విభాగం అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ సూచించారు. సోమవారం ఆళ్లగడ్డ పట్టణం లోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో సబ్ డివిజన్ పరిధిలోని హోమ్ గార్డులకు రానున్న ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఆదేశాల మేరకు రానున్న స్థానిక సంస్థలు ఎన్నికలలో ఏ ఒక్క చిన్న సమస్య కూడా తలెత్తకుండా శాంతిభద్రతల సంరక్షణలో ప్రతి ఒక్క సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. ఎవరికి కేటాయించిన ప్రదేశాలలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో రూరల్ సీఐ బివి రమణ, పట్టణ సీఐ నాగరాజరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.సుధాకర్ రెడ్డి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. సమగ్ర శిక్షా అభియాన్ నంద్యాల జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) గా బాధ్యతలు స్వీకరించిన కె. సుధాకర్ రెడ్డి, నంద్యాల మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా చార్జ్ తీసుకున్న సందర్భంగా ఆయన మంత్రి ఎన్ఎండి ఫరూక్, యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్‌లకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుధాకర్ రెడ్డి కి అభినందనలు తెలియజేస్తూ, జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విద్యాభివృద్ధికి, పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. విద్యారంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం తుమ్మడపల్లె గ్రామ చెరువు కట్ట సమీపంలోని మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి.స్థానికుల వివరాల మేరకు.. నంద్యాల నుండి మహానంది వైపు వెళుతున్న బుల్లెట్ వాహనంను నంద్యాల వైపు అరటి ఆకుల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నంద్యాలలోని కోట వీధికి చెందిన సయ్యద్ మహమ్మద్ ఖాసీం కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని మహానంది పోలీసులు, స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టామని మహానంది ఎస్ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

## ఆదోని--కర్నూలు మధ్య అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలి.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు, విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆదోని--కర్నూలు మధ్య అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదోని ప్రాంతం నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్యం, ప్రభుత్వ కార్యాలయాల పనుల నిమిత్తం కర్నూలుకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు ఉన్నత విద్య, కోచింగ్, వివిధ పోటీ పరీక్షలు, ఇతర విద్యా అవసరాల కోసం కర్నూలుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అయితే ఆదోని--కర్నూలు మధ్య సరిపడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో బస్సుల కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. వినతిపత్రంపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే ఆర్టీసీ ఆర్ఎంను పిలిపించి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఆదోని--కర్నూలు మార్గంలో బస్సుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రజలు, విద్యార్థుల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు రద్దీ సమయాల్లో ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.



## పిజిఆర్ఎస్ లో అర్జీలకు పరిష్కారం ఏది?

**రైతు బజార్ లో స్టాళ్ల కోసం నెలల తరబడి నిరీక్షణ!**
**అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం శూన్యం.....**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.



ఈ నేపథ్యంలో మిలిటరీ కాలనీ గ్రామానికి చెందిన పొదుపు సంఘాల లీడర్లు, సభ్యులు సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తమకు రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించేందుకు స్టాళ్లు ఏర్పాటు చేయాలని గత కొన్ని నెలలుగా సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్జీలపై పూర్తిస్థాయిలో విచారణ జరపకుండా కేవలం ఎండార్స్‌మెంట్లు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని పొదుపు సంఘాల లీడర్లు, సభ్యులు ఆరోపించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, సి-క్యాంప్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి హరీష్ వ్యవహరిస్తున్న తీరుతో తమ సమస్య పరిష్కారం కావడం లేదని వారు పేర్కొన్నారు.

పొదుపు సంఘాల సభ్యులు కూరగాయల విక్రయాల ద్వారా ఉపాధి పొందేందుకు రైతు బజార్‌లో స్టాళ్లు కేటాయించాలని, తమ సమస్యను పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

## 30న కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి.



ఆదోని (పల్లె వెలుగు): సమగ్ర శిక్షలో ఆర్ట్, క్రాఫ్ట్, హెల్త్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సమగ్ర శిక్ష పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్. కీర డిమాండ్ చేశారు. ఈ నెల 30న కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం పీటీఐ ఫెడరేషన్ ఆదోని మండల అధ్యక్షుడు వరప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. కీర మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాలుగా సమగ్ర శిక్షలో ఆర్ట్, క్రాఫ్ట్, హెల్త్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను విద్యాశాఖలో విలీనం చేసి వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అప్పటివరకు ఎస్జీటీ స్కేల్ ప్రకారం రూ.32,670 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ కార్డులు, ఈపీఎఫ్, ఈఎస్ఐతో పాటు అర్హతకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచడంతో పాటు తగిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని ఎన్. కీర కోరారు. సాధారణ మరణ పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు, ప్రమాదవశాత్తు మరణ పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో జిల్లాలోని సమగ్ర శిక్ష పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఆర్ట్, క్రాఫ్ట్, హెల్త్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలు, జిల్లా కమిటీ సభ్యుడు జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలి

ఆదోని, (పల్లె వెలుగు): సెప్టెంబర్ 28: భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని ఏఐవైఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆదోనిలోని తిమ్మారెడ్డి బస్టాండ్ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువతతో ప్రతిజ్ఞ చేయించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్. సుదర్శన్, పట్టణ కార్యదర్శి టి. వీరేష్, మండల-1 కార్యదర్శి కల్లుబావి రాజు తదితరులు మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన యువ విప్లవకారుడని తెలిపారు. స్వాతంత్ర్యంతో పాటు సామాజిక సమానత్వం, శాస్త్రీయ దృక్పథం, దోపిడీ వ్యతిరేకత వంటి అంశాలపై ఆయన చేసిన ఆలోచనలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. భగత్‌సింగ్ జీవితం యువతకు చదవడం, ప్రశ్నించడం, అన్యాయాన్ని ఎదిరించడం, సామాజిక మార్పు కోసం కృషి చేయడం వంటి విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువతలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సాన శ్రీనివాసులు

**పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డికి కృతజ్ఞతలు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కర్నూలు నగరపాలక సంస్థ 32వ వార్డు మాజీ కార్పొరేటర్ సాన శ్రీనివాసులు నియమితులయ్యారు. తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ శాసనసభ్యులు కాటసాని రామభూపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాటసానిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాన శ్రీనివాసులు మాట్లాడుతూ... పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం కాటసాని రామభూపాల్ రెడ్డి నూతన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలుపుతూ, చేనేత వర్గాల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మైతపు నరసింహులు, వీరయ్య, కో-ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, ముఖ్య నాయకులు మంచాల సుధాకర్ రెడ్డి, రంగప్ప, వీరేంద్ర కుమార్, అబ్దుల్లా బాషా, మోహన్, కంగాల్ బాషా, రహిమాన్, కేశవ, కేశవ రెడ్డి, ఆదినారాయణ, సుందరం, మనోహర్ రాజు, బొగ్గుల అయ్యన్న, ఇలియాస్, రమణ, దేవేంద్ర, నరసింహారెడ్డి తదితరులు పాల్గొని శ్రీనివాసులుకు అభినందనలు తెలిపారు.





## పార్టీ బలోపేతమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేద్దాం: పాణ్యం బీసీ సెల్ అధ్యక్షుడు భవాని

- కార్యకర్తల కష్టానికి తగిన గుర్తింపు ఇచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు
- గ్రామ స్థాయి బాధ్యులకు నియామక కార్డుల పంపిణీ

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పునరంకితం కావాలని, పార్టీ శ్రేయస్సు కోసం నిరంతరం కష్టపడే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు లభిస్తుందని నూతనంగా నియమితులైన పాణ్యం బీసీ సెల్ అధ్యక్షుడు భవాని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి వివిధ హోదాలకు సంబంధించిన గుర్తింపు కార్డులు మంజూరైన నేపథ్యంలో స్థానికంగా నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల వారీగా నియమితులైన బాధ్యులకు నియామక పత్రాలు (కార్డులు) అందజేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. నియోజకవర్గ నాయకుడు, గురుతుల్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆశీస్సులతోనే కార్యకర్తలకు ఈ పదవులు దక్కాయని తెలిపారు. ఇన్నాళ్లూ పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన సేవాభావాన్ని గుర్తించి వైఎస్సార్‌సీపీ నాయకత్వం గౌరవించిందని కొనియాడారు. కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోస్తూ ముందుకెళ్లిన వారికి అండగా నిలవడం వైఎస్సార్‌సీపీ నైజమని అన్నారు. తాను మొదటి నుంచి పార్టీ కోసం నిబద్ధతతో శ్రమిస్తున్నానని, తన పనితీరును గుర్తించి కాటసాని రాంభూపాల్ రెడ్డి పాణ్యం బీసీ సెల్ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలను అప్పగించినందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా ఐక్యంగా నిలిచి పార్టీ పటిష్టతకు అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో వైయస్సార్ సిపి నాయకులు భవాని అభిమానులు పాల్గొన్నారు



## పల్లె పండుగ 3.0తో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి.



ఆదోని (పల్లె వెలుగు): పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలను మరింతగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని ఏపీ స్టేట్ కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. రేపటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని దేవేంద్రప్ప తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖను పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

**పల్లె పండుగ 1.0తో 30 వేల పనులు**

పల్లె పండుగ 1.0 కింద సుమారు రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు చేపట్టినట్లు దేవేంద్రప్ప తెలిపారు. గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు.

**పల్లె పండుగ 2.0లో 52,382 పనులు**

పల్లె పండుగ 2.0 కింద రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.6,787 కోట్లతో 52,382 అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత రెండేళ్లలో పల్లెల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

**రూ.11,085 కోట్లతో పల్లె పండుగ 3.0**

ఇప్పుడు పల్లె పండుగ 3.0 కింద రూ.11,085 కోట్లతో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు దేవేంద్రప్ప వెల్లడించారు. ఇందులో ప్రధానంగా:
- రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు - రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు - రూ.300 కోట్లతో పాడి రైతుల కోసం 22 వేల మినీ గోకుల్ షెడ్లు
- తోటల పెంపకానికి రూ.225 కోట్లు
- మురుగు కాలువల నిర్మాణానికి రూ.110 కోట్లు
- వీజీ--జిరామ్‌జీ కింద రూ.1,750 కోట్లు
- ఆర్టికల్చర్ పనులకు రూ.3,800 కోట్లు

వంటి పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

**గ్రామీణ మౌలిక వసతులకు ప్రాధాన్యం**

ఏళ్ల తరబడి సరైన రహదారులు లేని గ్రామాలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతాలకు వెలుగులు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవేంద్రప్ప పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని దేవేంద్రప్ప విమర్శించారు. అరకొర పనులతో పల్లెల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందని ఆయన తెలిపారు. పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు అందుబాటులోకి వచ్చి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించనున్నాయని మాన్వి దేవేంద్రప్ప పేర్కొన్నారు.

## పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.

ఆదోని (పల్లె వెలుగు): తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కర్నూలు జిల్లా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఐటీడీపీ సభ్యులకు సూచించారు. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు గట్టు తిలక్ ఆధ్వర్యంలో ఐటీడీపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గుడిసె ఆది కృష్ణమ్మ ఐటీడీపీ సభ్యులకు పార్టీ కార్యక్రమాలు, సోషల్ మీడియా ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం-జనసేన--బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల నుంచి వచ్చే ఆరోపణలు, తప్పుడు సమాచారంపై వాస్తవాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత ఐటీడీపీ సభ్యులపై ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**గ్రామస్థాయి నుంచి ఐటీడీపీ కమిటీల ఏర్పాటు**

త్వరలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల స్థాయిలో ఐటీడీపీ నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు కృష్ణమ్మ తెలిపారు. ప్రతి గ్రామం నుంచి ఇద్దరు సభ్యులతో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.
మంత్రులు, శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిల సహకారంతో ఐటీడీపీ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె అన్నారు. రానున్న రోజుల్లో సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీపీ నాయకులు హెచ్. నాగరాజు, బి. కృష్ణ నాయుడు, కే. వీరేష్, వీరేష్ బాబు, బి. విజయ్, ఎం. చిదానంద, వి. కిరణ్ కుమార్, మున్వర్, సయ్యద్ భాష తదితరులు పాల్గొన్నారు.

